# కిట్టు

దడ్!

గాలిలో గిరికీలు కొడుతూ గులకరాయి వెళ్ళి ఇనుపగేటుకు తగిలింది.

రోడ్డు మీద గెంతులు పెడుతూ - అప్పుడప్పుడూ చిన్న పల్టీలు వేస్తూ - హుషారుగా గులకరాళ్ళను విసురుతున్న కిట్టు మొదటిసారి ఆ శబ్దాన్ని పట్టించుకోలేదు.

కిట్టు విసిరిన రాళ్ళు రెండోసారి, మూడోసారి, మరోసారి ఆ గేటుకే తగిలాయి.

చివరిసారి రాయి శబ్దంతో పాటు గేటు తెరిచినశబ్దం వచ్చింది.

"రాళ్ళను అలా విసిరితే కళ్ళకు తగలవూ?" గట్టి మందలింపు కూడా వచ్చింది.

కిట్టు టక్కున ఆగిపోయి, అటువైపు చూసాడు.

ఆ ఇంటావిడ గేటు మీద చేతులాన్చి చూస్తోంది.

కిట్టు తత్తరపోయి పరుగులంకించికున్నాడు. ఆ వేగంలో ఎదురుగా వస్తున్న మనిషిని ఢీ కొట్టాడు. కిట్టును ఒడిసి పట్టుకున్నాడతను.

" ఏరా కిట్టిగా? ఏందా పరుగు? వొళ్ళు పయి తెలీట్లా?"

కిట్టువాళ్ళ నాన్న కిట్టు నోరు తడారిపోయింది.

కిట్టు భయాన్ని కప్పిపుచ్చుకొంటూ జుట్టు ఎగదోసుకున్నాడు. వాళ్ళ నాన్నకి సమాధానంగా తల అడ్డదిడ్డంగా ఆడించాడు.

కిట్టువాళ్ళ నాన్న వాణ్ణి నానా బూతులు తిడుతూ - తీసుకొచ్చి వాళ్ళమ్మ ముందు పడేసాడు.

కిట్టు వీధిబడిలో మూడోతరగతి చదువుతున్నాడు. ఈ రోజే బడికి వేసవి సెలవులు ఇచ్చారు. అదీ కిట్టు ఉత్సాహం. ఆ ఉత్సాహంలో పుస్తకాల సంచిని కూడా మర్చిపోయి వచ్చాడు. ఇంటికి వచ్చాక గుర్తొచ్చింది.

కిట్టు గుండె గొంతులో కొట్టుకుంది. బిక్కుబిక్కుమంటూ ఓ మూలననక్కాడు.

''ఏదవన్నర ఏదవనీ! మరీ పెత్తరిగాడివవుతున్నావ్. ఇదేందిరా.... ఈ సంచి ఎక్కడ వదిలేసావ్? ఆ లక్ష్మి ఎత్తిపెట్టి తెచ్చింది కాబట్టి సరిపోయింది'' అంటూ కిట్టూవాళ్ళమ్మ - కిట్టుని వెతికి మరీ ఓ మొట్టికాయ వేసింది.

కిట్టు హుషారు మళ్ళీ వాడి మొహంలోకి వచ్చేసింది.

''నీక్కూడా సెలవలట్నే?'' అప్పుడే వచ్చిన స్వర్ణని ఆరాతీసింది కిట్టువాళ్ళమ్మ.

''ఆ....!'' స్వర్ణ నీరసంగా జవాబిచ్చింది.

స్వర్ణ కిట్టు చిన్నక్క - ఆడపిల్లల బడిలో ఎనిమిదో తరగతి చదువుతోంది.

''అయితే రేపట్నించి ఇడ్లీ ఏద్దాం!'' కిట్టువాళ్ళమ్మ ప్రకటించేసి వెళ్ళిపోయింది.

''ఎప్పుడు ఇడ్లీలు, దోసెలు అమ్ముకుతిందామా-అన్న యావతప్పితే... ఓ సరదాలేదు పాడులేదు. క్లాసులో అమ్మాయిలంతా ఏ సినిమాకి వెల్దామా ఏ షికారుకి వెల్దామా అని ఆలోచిస్తుంటే తను దేబ్యం మొహం వేసుకొని పిండి రుబ్బుకురావాలి! హు!'' స్వర్ణ విసురుగా పుస్తకాల సంచిని గిరాటేసింది.

''సినిమాకు అయితే నేనూ వస్తా ... అక్కా!'' కిట్టు విప్పారిన మొహంతో అన్నాడు.

''ఒరేయ్... అమ్మతో అన్నావంటే....!'' స్వర్ణ కిట్టు చొక్కా దొరకబుచ్చుకొని, గుద్దురిమింది.

కిట్టు నేర్పుగా తప్పించుకొని పరుగుతీసాడు.

మర్నాడు ఉదయాన్నే కిట్టువాళ్ళమ్మ ఇడ్లీలు, దోసెలు వేయాడానికి కావలసిన సరంజామానంతా తెచ్చింది. మధ్యాహ్నానికిపిండి ఆడించుకొచ్చే పని సిద్ధమైంది కిట్టుకు, స్వర్ణకు.

స్వర్ణ రెండు టిఫిన్లను మోస్తూ వస్తుంటే -కిట్టు వాళ్ళమ్మ ఇచ్చిన చిల్లర డబ్బుల్ని జేబులో వేసుకొని దర్జాగా నడిచాడు.

పిండి ఆడించేవాడు స్వర్ణను చూసి కిసుక్కున నవ్వాడు - '' ఏంటీ సెలవులు ఇచ్చారా?'' అంటూ, స్వర్ణ నవ్వుతూ తలాడించింది.

కిట్టు బయటవున్న చిన్న బెంచి మీద కూర్చుని వచ్చేపోయేవాళ్ళని పలకరిస్తున్నాడు. స్వర్ణ పిండిమర దగ్గరే వుండిపోయింది.

కిట్టువాళ్ళు అందరికన్నా చివర పిండి తీసుకొని బయలుదేరారు.

మర్నాడు పొద్దుటే కిట్టూవాళ్ళమ్మ ఇడ్లీలు, దోసెలు, వడలు వేయడం మొదలు పెట్టింది.

వాసన పసిగట్టినట్లుగా - రిక్షావాళ్లు వచ్చి వాళ్ల యింటి ముందు గుమిగూడారు.

రోడ్డును ఆక్రమించి, నాలుగు సవకలు పాతి, పాతరేకులు, కొబ్బరి మట్టలు - పోస్టర్లు కప్పుగా వేసి - చుట్టు గోనె పట్టాలు దిగేసిన ఇల్లది.

గోడలుగా భావించే గోనెపట్టాలు పైకి ఎత్తగానే అదిహోటల్ అయిపోయింది.

స్వర్ణ ఆకుదొన్నెల్లో రిక్షావాళ్ళకి అడిగినవి పెట్టిస్తే - కిట్టు వాళ్ళ దగ్గర డబ్బులు వసూలు చేసుకొన్నాడు. వాడికి ఈ పని ఎంతో నచ్చింది.

ఇంతలో కిట్టువాళ్ళ నాన్న ఊడిపడ్డాడు.

కిట్టుకి వాళ్ళ నాన్న ఎప్పుడు వస్తాడో పోతాడో తెలియనే తెలియదు. రావడంతోనే రాద్ధాంతం మొదలు పెడతాడు. అందుకే వాడికి వాడి నాన్నంటే భయం. వున్న నలుగురు తినెళ్ళాక - కిట్టూవాళ్ళనాన్న గోనె పట్టాను కిందికి దించాడు.

స్వర్ణ కిట్టును దూరంగా తీసికెళ్లింది.

చాలాసేపు నాన్న అరుపులు - నాలుగు గుద్దులు కూడా గుద్దిన శబ్దం - అమ్మ ఏడుపులు మొత్తుకోళ్ళు - వినిపిస్తూనే వున్నాయి.

కిట్టూవాళ్ళ నాన్న వచ్చినట్లే వెళ్లిపోయాడు.

కిట్టు, స్వర్ణ నెమ్మదిగా వాళ్లమ్మ దగ్గరికి వెళ్లారు.

వాళ్లమ్మ పెదవి చిట్లివుంది. జుట్టంతా చిందరవందరగా మొహమంతా తడితడిగా ''ముదనష్టపు సచ్చినోడు! ఆడెన్ని ముదనష్టపు పనులు చేసినా చెల్లుద్ది! ఏదో బిడ్డకు కాళ్ళ పట్టీలు కొందామనుకొంటే...'' కిట్టూవాళ్ళమ్మ ముక్కు ఎగబీల్చింది.

''వెదవ పట్టీలు లేకపోతే పోయినయి.... ఇడ్లీ పీడా తప్పింది'' - అని స్వర్ణ సంతోషించింది.

కిట్టుకు వాళ్ళ నాన్న పని ఏ మాత్రం నచ్చలేదు. మౌనంగా వెళ్లి ఓ గ్లాసెడు నీళ్లు తెచ్చి వాళ్ళమ్మ చేతికించాడు.

కిట్టువాళ్లమ్మ బాధంతా మటుమాయం అయ్యింది. సంతోషంతో కొడుక్కి మెటికలు విరిచింది.

స్వర్ణ మూతి వంకర్లు తిప్పి బయటకు వెళ్లింది.

ఆ రాత్రి కిట్టుకి ఎందుకనో వాడి పెద్దక్క గుర్తొచ్చింది.

రత్నక్క ఎంత మంచిదో, తనంటే భలే ఇష్టం. గారాబం చేసేది. ముద్దుగా చిన్నా....అని పిలిచేది. చక్కగా ముస్తాబు చేసేది. అన్నం పెట్టేది. కథలు చెప్పేది. బడిదాకా సాగనంపి వచ్చేది.

కిట్టుకు అక్క జ్ఞాపకం రాగానే - అక్క మాటెత్తితే వొళ్ళు చీరేస్తానన్న నాన్న గుర్తొచ్చాడు.

నాన్న మంచాడు కాదు. అందుకే అక్క వెళ్లిపోయింది. కాదుకాదు, అక్కే మంచిది కాదంట... అందుకే నాన్నకు కోపమంట... ఏది ఏమైనా అక్కవుంటేనే బావుండేది.

కిట్టు తన పక్కనే పడుకొని వున్న స్వర్ణను మెల్లిగా తట్టి అదే మాటన్నాడు. స్వర్ణ నిద్రలో మూలిగింది.

మర్నాటి నుంచీ కిట్టుకి ఆడుకున్నన్ని ఆటలు.

శీను, లక్ష్మిలతో కలసి దొంగాట, దాగుడుమూతలు, గోలీలు, బిళ్లంగోడు... అన్నీ ఆడుతున్నాడు.

అయితే, వాళ్ల ఆటలు పూర్తిగా సాగలేదు.

శీనుని వాళ్లనాన్న టీ అంగట్లో పనికి కుదిర్చాడు. లక్ష్మి ఎవరింట్లోనో పాపను ఎత్తుకొనే పనికి కుదిరింది.

కిట్టు ఒక్కడూ బొంగరం ఆట తప్పితే ఆడుకోలేదు.

అయినా, వీధి కొళాయి దగ్గర బిందెపెట్టి, కాపలాకాయడం - పొయ్యిలోకి పుల్లలు ఏరుకురావడం - చిల్లర అంగడికి పోయిరావడం - అన్నీ సరదానే వాడికి.

ఓ రోజు చిల్లర అంగట్లో ఏదో కొని పరిగెత్తుకొస్తుంటే వెనుక నుంచి పిలిచారెవరో, కిట్టు గబుక్కున వెనక్కితిరిగాడు. పిలిచినావిడ ఎవరో కిట్టుకు చప్పున గుర్తు పట్లేదు. ఆవిడ నగలు, బట్టలు మాత్రం ఘనంగా వున్నాయి.

''ఒరేయ్ చిన్నా!''

''రత్నక్క'' కిట్టు ఆశ్చర్యంగా తనలో తను గొణుక్కున్నాడు.

రత్న గబగబ కిట్టు దగ్గరికి వచ్చింది. వాడిచేయి పట్టుకొని పక్కకి లాకెళ్ళింది. వాడి చేతిలో ఓ బిస్కట్ పొట్లం పెట్టింది. ఇంట్లో వాళ్లందరి గురించి ఆరా తీసింది.

కిట్టు ఆ - ఊ ....సమాధానాలిచ్చాడు.

చివరికి అడగలేక అడిగింది రత్న '' ఏరా చిన్నా...నన్నెప్పుడైనా తలుచుకొంటారా?''

కిట్టుకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. తల అడ్డంగా ఆడించి, నిలువుగా ఊపాడు.

రత్న బొటబొట కన్నీళ్లు కార్చింది.

కిట్టుకి ఆదుర్దా ఎక్కువైంది. వాళ్ల నాన్న ఎక్కడి నుంచైనా ఊడిపడతాడేమోనని ఓ పక్క ఆందోళనగా వుంది. పై నించి రత్న ఏడుపు.

కిట్టు రత్న చేయి విడిపించుకొని దూరంగా జరిగాడు.

రత్న కళ్లు తుడుచుకొని నవ్వింది.

''బాగా చదువుకోరా చిన్నా.... స్వర్ణని బాగా చదువుకోమను. అమ్మ మాట వినమను'' అంటూనే గబగబ వెళ్లిపోయింది రత్న.

కిట్టు రత్న వెళ్లినవైపే చూస్తూ ఉండిపోయాడు.

''ఒరేయ్ కిట్టూ .... ఈ బిస్కట్లు నాకు!'' కిట్టు చేతిలో బిస్కట్ ప్యాకెట్ ఎవరో లాక్కోవడంతో కిట్టూ లోకంలో పడ్డాడు.

అందుకో చూద్దాం - అన్నట్లు చేయిచాస్తూ - పరిగెత్తడానికి సిద్ధంగా ఉన్నాడు శీను.

కిట్టు ఏమీ పట్టించుకోలేదు. వాడి మనసంతా అదోలా వుంది. మౌనంగా ఇంటివైపు నడిచాడు.

శీను కిట్టును ఆటలు పట్టించాలని రెండుమూడుసార్లు ప్రయత్నించాడు. లాభం లేదు. శీను కిట్టును మౌనంగా అనుసరించాడు.

''మీ నాయన కొట్నాడ్రా?'' కాసేపాగి అడిగాడు శీను.

లేదన్నట్లు భుజలెగరేసాడు కిట్టు

శీను ఏదో కబుర్లు ఆపకుండా చెపుతూనే వున్నాడు. తనూ మాట్లాడాలన్నట్లు శీను టీ అంగడి గురించి ఆరా తీసాడు కిట్టు.

అడిగింది ఆలస్యం - శీను భుజానవున్న చిన్న టవల్ దులిపి తలకు చుట్టుకొన్నాడు. టీ కప్పులు అందించే విధం, టేబుల్ తుడిచే విధానం అభినయించి చూసాడు. కప్పు మీద కప్పు పెట్టుకొని - కప్పులో టీ తొణకకుండా - అటు ఇటు ఊగిపోతూ నడిస్తే ఎలా వుంటుందో చూపించాడు. ఆ తరువాత రెండు చేతుల్లో కప్పులు, తల మీద కప్పు.

ముఖకవళికలకు తగ్గట్లు, చేతు లాడిస్తూ, ఈల వేస్తూ కడుపుబ్బ నవ్వించాడు శీను.

ఇల్లు రావడంతో కిట్టు నవ్వుతూనే ఇంట్లోకి వెళ్ళాడు.

ఎందుకనో స్వర్ణ కూడా మాటిమాటికీ అద్దంలో చూసుకొంటూ - తనలో తను నవ్వుకుంటోంది.

అక్కడక్కడ తళుకులు, పూసలు కుట్టిన గులాబి రంగు సిల్కురిబ్బను జడకు కట్టుకొని వుంది. అద్దాన్ని అటు ఇటూ తిప్పుతూ - అద్దంలో రిబ్బను చూసుకోవడానికి ప్రయత్నిస్తోంది. కిట్టు వచ్చిన సవ్వడికి చప్పున రిబ్బను విప్పేసి, పుస్తకాల సంచిలో దాచేసింది.

రాత్రి పడుకున్నాక - కిట్టు నెమ్మదిగా స్వర్ణను కదిలించాడు.

''అక్కా....రత్నక్క ఎక్కడికి పోయింది?''

''ఏట్లోకి పోయింది!'' చిరాకు పడింది స్వర్ణ

''రత్నక్క మంచిది కదక్కా?'' కాసేపాగి అన్నాడు కిట్టు

''కాదు! అయినా ఆ సంగతి నీ కెందుకురా? గమ్మున పడుకో!'' కసిరింది స్వర్ణ.

రత్నను కలిసిన విషయం చెప్పబోయి - స్వర్ణ మొహం చూసి మాటలు మింగేసాడు కిట్టు.

మర్నాడు స్వర్ణ ఎక్కడికో బయలుదేరింది. కిట్టూను సిద్ధం చేసింది వాళ్లమ్మ. స్వర్ణ కాసేపు గునిసింది. అవ్వనని తెలిసాక - వాడిని వెంట తీసుకొనే బయలు దేరింది. వీధి మలుపు తిరిగాక గుప్పిట్లో దాచిపెట్టిన గులాబిరిబ్బన్ తీసి, జుట్టుకు కట్టుకుంది. మునివేళ్లతో ముంగురులను నుదుటి మీదికి సర్దుకుంది.

కిట్టు అదేం పట్టించుకోలేదు. వాడు ఓ కంకరరాయిని కాలి బొటన వేలితో నెడుతూ అది ఎటువెళితే అటు వెళుతూ - స్వర్ణను అనుసరిస్తున్నాడు.

స్వర్ణ తిన్నగా సినిమా టాకీసు దగ్గరకు వెళ్లి ఆగింది.

కిట్టుకి చాలా సంతోషమేసింది. చిన్న కేక పెట్టినంత పని చేసాడు. వాడికి ఇష్టమైన హీరో సినిమా అది. అయితే, కిట్టు సంబరాల అంబరం నుండి నేల పడేట్లుగా చెవిమెలిపెట్టింది స్వర్ణ. కిట్టు గింజుకున్నాడు. ఎవరితోనైనా చెబితే వొళ్లు చీరేస్తానని బెదిరించింది స్వర్ణ.

స్వర్ణ అంత మాత్రపుదే. అందుకే కిట్టు బుద్ధిగా తలాడించాడు.

ఎందుకనో స్వర్ణ అదుర్దా పడుతోంది. కిట్టు వాల్ పోస్టర్లనూ, కిటికిటలాడుతోన్న జనాల్ని కళ్లప్పగించి చూస్తున్నాడు.

ఇంతలో పిండిమరవాడు వాళ్ల దగ్గరికకి వచ్చాడు.

స్వర్ణ ముఖం .విప్పారింది. గులాబిరిబ్బన్ అలవోకగా సర్దింది.

అతని ముఖమూ విప్పారింది. ఇద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

అతని చూపు కిట్టు మీద పడింది. ఏమిటీ తద్దినం అన్నట్లు సైగచేసాడు. స్వర్ణ నవ్వుతూనే ఫర్వాలేదని భరోసా ఇచ్చింది.

సినిమా జరిగినంత సేపూ కిట్టుకి చిరాగ్గానే వుంది. పిండిమరవాడు పిండిమర ఆడించినట్లుగానే ఆపకుండా మాట్లాడుతున్నాడు. స్వర్ణ అయిందానికి కానిదానికి కిసుక్కుమంటోంది.

కిట్టు వాళ్ళిద్దరి వైపు ఓ సారి కొరకొరా చూసాడు. పిండిమరవాడు కొనిచ్చిన చిరుతిళ్లు తింటూ - సినిమాలో నిమగ్నమయ్యాడు.

సినిమా అంతా అయ్యాక స్వర్ణ చేతిలో చేయివేసి ఏదో చెప్పాడతను. స్వర్ణ తలాడించింది. కిట్టు చెవులప్పగించాడు. వాడికి రహస్యపు సినిమా ఎప్పుడో తెలవాలిగా!

''మీ నాయన్ని ఇవ్వాళ వదులుతారంట. తిన్నగా ఇంటికే వస్తాడేమో.... నువ్వెళ్ళే సరికి....''

స్వర్ణ ముఖం అప్రసన్నంగా పెట్టింది.

''ఉత్తరాదిముఠా అంటగా ? అందుకే మీ నాయన్ని కూడా ఇరికించినయ్యి!'' కన్నుగీటి నవ్వాడతను.

స్వర్ణ ఏమీ మాట్లాడలేదు. కిట్టుచేయి పట్టుకొని బయటకు నడిచింది.

అతను వీళ్లను సైకిల్ మీద వెంబడించాడు. అడ్డంగా వచ్చి, సైకిలాపాడు. కిట్టు చేతిలో చాక్లెట్లు స్వర్ణ చేతిలో గాజుల జత పెట్టాడు. రివ్వున వెళ్లిపోయాడు.

కిట్టు చాక్లెట్లు దార్లోనే తినేసాడు. స్వర్ణ కిట్టును దారిపొడువునా బెదిరిస్తూనే వుంది.

స్వర్ణ అన్నిసార్లు చెప్పాల్సిన అవసరమే లేదు. కిట్టుకు దొంగ సినిమా, చిరుతిళ్లు బాగా నచ్చాయి. వాడు స్వర్ణ పక్షమే.

ఇంటికి అల్లంత దూరాన ఉండగానే, రిబ్బన్ విప్పి చేతిలో ముడుచుకుంది స్వర్ణ. గాజుల జతను పావడా మడతల్లో దాచింది.

కిట్టువాళ్ల నాన్న యింటి ముందున్న బెంచి మీద కూర్చుని వున్నాడు. అతని పక్కనే కిట్టూవాళ్ళమ్మ.

స్వర్ణ చడీ చప్పుడు కాకుండా ఇంట్లోకి దూరింది.

కిట్టు వెళ్లి వాళ్లమ్మను ఆనుకొని నిల్చున్నాడు.

కిట్టువాళ్ల అమ్మనాన్నలు ఏదో తీవ్రంగా మాట్లాడుకుంటున్నారు. కిట్టును పట్టించుకోలేదు.

" ఆ ఎదవనాయాల్ని వదిలిపెట్టేది లేదు! దొంగ లమ్డి కొడుకు! ఇవ్వాళ ఆడో నేనో తేలిపోవాల!" తుపుక్కున ఉమ్మేసాడు కిట్టూవాళ్ల నాన్న.

" ఏంటి తేలేది? చేసిందానికి అనుభవిత్తంది. చాలదా?" కిట్టు వాళ్లమ్మ నిష్ఠూరపడింది.

" ఎవురే చేసింది? అసలు నిన్నంతా..." కిట్టూ వాళ్ల నాన్న మొహం జేవురించింది. పళ్ళు పట పటమని కొరికాడు.

కిట్టూవాళ్ల నాన్నని ఉత్తరాది అమ్మాయిలతో సహా రమణ పోలీసులకు పట్టిస్తే - రమణ ముఠాని వీళ్ల మనుషులు ఇరికించారు. వీళ్ల పనిలో ఇవన్నీ మామూలే. అయితే, రత్న .... కిట్టువాళ్ల నాన్న ఎదురుగా వున్న సెల్‌లోనే వుంది. పోలీసులు వాళ్ల చిల్లర వేళాకోళాలు - చవుకబారు హాస్యాలు - రత్న వాళ్ల దగ్గరకి పోయి రావడం - గుర్తుకురాగానే అతడి హృదయం కుతుకుతలాడి పోతోంది.

అతను దిగ్గున లేచాడు. పిడికిళ్లు బిగించాడు.

కిట్టు భయంతో వాళ్లమ్మ చాటున నక్కాడు. వాళ్లమ్మ కిట్టును విదిలించేసింది - గబుక్కున పోయి కిట్టువాళ్ల నాన్న కాళ్ళు వాటేసుకొంది. శోకాలు పెట్టింది.

"మావో... ఏం సేయమాక! నీ కాళ్లట్టుకుంటన్నా! పోయిందెట్లా పోయింది. ఆ ఆడకూతుర్ల ఉసురు మనకొద్దు! ఇప్పుడు ఏడ్చి చత్తంది చాలు. ఆ రమణగాడు ఎట్టాపోతే మనకెందుకు? వదిలేసెయ్.... వదిలేసెయ్.... ఈ యాపారమే వదిలేసెయ్...."

కిట్టువాళ్ల నాన్న ఒక్క విదిలింపు విదిల్చాడు. వాళ్లమ్మ కుప్పలా కూలబడింది.

"నీవేం చెప్పబల్లా! గమ్మునుండు! యాపారమన్నాక యాపారమే. యవ్వారమన్నాక యవ్వారమే!.... ఆ లమ్డీకొడుకు నా యాపారం పడేయడానికి నా బిడ్డనే లేపుకుపోతాడు? నా కళ్ళముందే దానిచేత యాపారం చేయిత్తాడా?

అసలు యాపారమే ఎట్టా చేత్తాడో... నేనూ చూత్తా!'' కండువా దులిపి భుజాన వేసుకొని - పంచె ఎగకట్టి - రయరయ వెల్లాడు కిట్టువాళ్ల నాన్న.

కిట్టూవాళ్లమ్మ నెత్తీనోరూ కొట్టుకుంటూ లబలబలాడింది.

కిట్టు ఆమె పక్కనే దిగాలుగా కూర్చున్నాడు.

''వెధవ సంత! వెధవ సంత! కాసేపు హాయిగా వుండనివ్వరు!'' స్వర్ణ విసుక్కుంది.

చీకటి పడ్డాక కిట్టువాళ్ల నాన్న వచ్చాడు.

అప్పటిదాకా బిక్కుబిక్కుమంటోన్న కిట్టు - భయంతో గుంజను వాటేసుకున్నాడు. కిట్టు అనుకున్నదేమీ జరగలేదు. అసలు పొద్దుటి కిట్టు వాళ్ల నాన్నకి ఇప్పటికి పోలికేలేదు. ఇప్పుడు అతని మొహం వెలిగిపోతోంది.

కిట్టువాళ్ళ నాన్న జిలేబి, పకోడి తెచ్చాడు. కోడి మాంసం తెచ్చాడు.

వచ్చీరాగానే ఓ సిరిచాప పరుచుకొని వెల్లకిలా పడుకున్నాడు. గొంతంతా విప్పి పద్యాలు పాడడం మొదలెట్టాడు.

కిట్టు వాళ్లమ్మ మళ్లీ పొయ్యి రాజేసింది.

స్వర్ణ విసుక్కుంటూ మసాలా నూరుతోంది.

కిట్టుకి పండగొచ్చినంత సంబరంగా వుంది. వాడు ఓ జిలేబి తీసుకొని స్వర్ణ దగ్గర కెల్లి కూర్చున్నాడు.

కిట్టూవాళ్లమ్మకి మాత్రం ఏదో అనుమానంగా వుంది. మెల్లిగా వెల్లి కిట్టూవాళ్ల నాన్న పక్కనే చతికిలపడింది.

''ఏం జేసొచ్చా? నిజం చెప్పు!'' నెమ్మదిగానే అయినా సూటిగా అడిగింది.

ఆమె మాట పట్టించుకోకుండా - అతనో సినిమా పాట ఎత్తుకున్నాడు. ఆమె మళ్ళీ మళ్ళీ అడిగింది.

ఇంతలో ఫిండిమరవాడు వాల్లింటి చుట్టు ఓ గిరికీ కొట్టివెల్లాడు. స్వర్ణ మొహం విప్పారింది. మరింత వేగంగా మసాలా నూరసాగింది.

''ఏం చేత్తానే? అంతకు అంత చేసా! ఇయ్యాల ఆడి పెల్లాన్ని కేసులో ఇరికించా. ఇక ముందు.... ముందు...చూసుకో!'' అనేసి నిశ్చింతగా తలకింద చేతులు పెట్టుకొని - పాట కొనసాగించాడు కిట్టూవాళ్ళ నాన్న.

'' ఓరీ నాయనో! ఆడ కూతురి ఏడుపు ఊరికే పోదురో....నేనెట్టా చేతురో!'' ఓ రాగం తీసింది కిట్టూవాళ్లమ్మ.

''ఛ.....గుమ్మగుండు! ఇప్పుడు శోకాండాలు పెట్టాల్సింది అఖ్ఖు!'' మోచేతి మీద లేచి అన్నాడతను.

పిండిమరవాడు మళ్లీ వచ్చాడు. స్వర్ణ కనిపించేట్లుగా సైకిల్ ఆపుకున్నాడు. ఓ కాలు కిందికి ఆన్చి నిల్చున్నాడు. స్వర్ణ పలకరింపుగా నవ్వింది. కిట్టు కూడా అతనిని చూసాడు. కిట్టు మొహాన కూడా నవ్వుకదలాడింది.

పిండిమరవాడు కిట్టూ వాళ్ల నాన్న కంట్లో పడనేపడ్డాడు.

'' ఈడు ఇక్కడికి ఎందుకొచ్చాడు?'' అంటూ లేచి కూర్చుని - అటు ఇటూ చూసాడు కిట్టూవాళ్ల నాన్న.

స్వర్ణ మొహంలోని తళుకు చీకట్లో కూడా స్పష్టంగా కనిపిసోంది. ఆ తళుకుకు అర్థం ఏమిటో అతనిని బాగా తెలుసు. నిటారుగా కూర్చున్నాడు, కనుబొమ్మలు ముడిపడ్డాయి.

'' ఎవరదీ?'' కిట్టూవాళ్లమ్మ అటూ ఇటూ చూసింది.

'' ఆ రమణగాడి మనిషి. ఆడిక్కడ ఏం చేత్తన్నాడు?'' తనలోతను గొణుక్కున్నాడు కిట్టూవాళ్లనాన్న.

ఇంతలో పిండిమరవాడు ఏదో సైగ చేసాడు. స్వర్ణ ఫక్కుమంది.

కిట్టూవాళ్ల నాన్న రయ్యిన వెళ్లి వాడి కాలర్ పుచ్చుకున్నాడు. సైకిల్ మీద నుంచి కిందికి తోసాడు. దభీ దభీ బాదాడు. మోచేతుల్తో పొడిచాడు. కాళ్లతో తన్నాడు.

అనుకొని పరిణామానికి స్వర్ణ, కిట్టు బెదిరిపోయారు.

'' ఆడు చత్తాడ్రోయ్ నాయనోయ్!'' అంటూ కిట్టూ వాళ్లమ్మ పరిగెత్తుకుపోయింది. అంతవరకు ఆ వీధి చివర పొంచివున్న లారీ అంతకన్నా వేగంగా దూసుకు వచ్చింది. పిండి మరవాణ్ణి దూరంగా నెట్టి - వెనక్కి తిరిగిన కిట్టువాళ్ల నాన్నని బలంగా ఢీకొట్టింది.

కిట్టూ వాళ్ళ నాన్న ఎగిరి అంత దూరాన పడ్డాడు.

స్వర్ణ వాళ్లమ్మ ఒక్క పరుగున వాళ్లనాన్న దగ్గరికి వెళ్లారు.

కిట్టు అయోమయంగా చుట్టూ చూసాడు.

లారీ సర్రున వెళ్లి వీధి చివరన ఆగింది. సైకిల్‌తో సహా పరిగెత్తుకెళ్లిన పిండిమరవాడు లారీ పైకి ఎగబాకాడు. లారీ దూసుకుపోయింది.

ఇంతలో జనాలు గుమిగూడారు.

కిట్టూవాళ్ల నాన్న గుడ్లు తేలేసాడు.

అందరూ గొల్లుమన్నారు.

పోలీసులు వచ్చారు. అందర్నీ దూరంగా నెట్టేసారు. కిట్టూవాళ్లమ్మని, స్వర్ణని ఏవేవో ప్రశ్నలడిగారు. కిట్టూవాళ్లమ్మ లారీ నడిపిన రమణని స్పష్టంగానే చూసింది. కానీ, ఎన్నిసార్లు అడిగినా ఎన్నిమార్లు అడిగినా తెలీదన్నట్లుగానే తలాడించింది.

కిట్టూకు పిండిమరవాడి విషయం చెపుదామని నోటి చివరదాకా వచ్చింది. ఎందుకనో నోరుపెగల్లేదు. వాడితో చూసిన సినిమాలు, చేసిన షికార్లు, తినిన చిరుతిళ్లు అన్నీ గొంతుకు అడ్డం పడ్డాయి. కిట్టు ఆ గుంపుకు దూరంగా నడిచాడు. కరెంట్ స్తంభం దిమ్మె మీద కులబడ్డాడు.

చాలాసేపటి తరువాత, ఓ ఆకారం బడ్డీకొట్టు చాటున నక్కడం వాడి కళ్లబడింది. కిట్టు తిన్నగా లేచి, బడ్డీ కొట్టు వెనక్కివెళ్లాడు. కిట్టు అనుమానం నిజమే. రత్న! కళ్ళ నీళ్లు పెట్టుకొని నిల్చునివుంది. కిట్టు గుడ్లప్పగించాడు.

"చిన్నా....నువ్వు బాగా చదువుకోరా! స్వర్ణని చదువుకోమనరా! ఈ రొంపిలో దిగమాకండిరా!" రత్న ఏడుస్తూ అంటూనే - కొంగు నోట్లో కుక్కుకుంది. వీధిలైటు పడని చీకటి పొడల్లో ఒదిగి దూరంగా వెళ్లిపోయింది.

ఎందుకో తెలీదు కానీ కిట్టు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

రోజులు గడిచి పోతున్నాయి. జరిగిన పరిణామాలన్నీ కిట్టుకి అయోమయంగా వున్నాయి. నాన్న పోయిన బాధగానీ దుఃఖంగానీ వాడికి లేదు. అభావంగా, నిర్లిప్తంగా తయారయ్యాడు. ఏమీ పట్టనట్లు వుంటున్నాడు.

కిట్టువాళ్ల మామయ్య వచ్చాడు. వాళ్ళతో నెమ్మదిగా చెప్పాడు.

" ఆ రమణగాడు బేషను కొచ్చి లొంగిపోయాడంట!"

కిట్టు వాళ్ల దగ్గర్నించి దూరంగా వెళ్లిపోయాడు.

గానుగ చెట్టు కింది లక్ష్మి కనిపించింది. కిట్టును చూసి దగ్గరికి వచ్చింది. దిగాలుగా పలకరించింది. కిట్టు ఏమీ మాట్లాడకురా నిల్చున్నాడు.

కాసేపటికి లక్ష్మి తనే మాట్లాడింది.

"బడికి సెలవులు అయిపోయాయిగా...పనిమానేసా"

కిట్టు ఏం మాట్లాడలేదు.

"నువ్వు బడికి వస్తావా?" లక్ష్మి అడిగింది.

కిట్టూ తలూపాడు.

"ఎలా వస్తావ్? నువ్వుబడి మానేయాలి, పన్లోకి వెళ్లాలి. శివం వాళ్ల నాన్న చచ్చిపోతే బడిమానేయలా? శివం లాగానే నువ్వూ పన్లోకి వెళ్ళాలి".

కిట్టుకి ఇంతవరకు ఈ ఆలోచన రాలేదు. వాడికెందుకో భయమేసింది. బడి ఎగ్గొట్టడమంటే వాడికి సరదానే. కానీ బడిమానేయడమే...!

కిట్టు కళ్లముందు రత్న మెదిలింది. రత్న తడి గొంతు కిట్టు చెవిలో గొణిగింది. "చదువుకో చిన్నా"

"నాన్న ఉంటే డబ్బులుంటాయి. చదువుకోవచ్చు. మీ నాన్నలేడుగా? ఇప్పుడు నువ్వు డబ్బులు తేవాలి!" ఆరిందాలా అంది లక్ష్మి.

లక్ష్మి చెప్పింది నిజమే. కిట్టూవాళ్ల నాన్న వున్నంత కాలం వాళ్లకు డబ్బుకు కొదవలేదు. శీనూ లాగా కిట్టుని ఎప్పుడూ పనికి పంపలేదు. వాళ్లమ్మని కూడా ఇడ్లీలవీ అమ్మనిచ్చేవాడు కాదు. బాధ్యతల బరువు చిట్టిబుర్ర మీద తెలియకుండానే వాలింది.

"నా మాట అబద్ధమైతే శీనుని అడుగుదాంరా!" లక్ష్మి కిట్టు చేయి పట్టి లాగింది.

ఇద్దరు శీను దగ్గరికి బయలుదేరారు.

కిట్టు ఏవేం పనులు చేయడానికి అవకాశముందో దారిలో వివరిస్తోంది లక్ష్మి.

కిట్టు కళ్లముందు ఆడుతూపాడుతూ పనిచేసుకొనే శీను మెదిలాడు.

ఒకవేళ పనిలో కుదరాల్సివస్తే శీనువాళ్ల టీ అంగడిలో చేరాలి. శీను, తనూ సరదాగా పనిచేసుకోవచ్చు. కానీ - బడి తెరిస్తే శీను పని మానేస్తాడే - కిట్టుకి దిగులేసింది.

"అరే శీనూ... ఏమైందిరా?" లక్ష్మి ఆశ్చర్యంతో అనడంతో కిట్టు ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

శీను కన్ను లొట్టపోయింది. బుగ్గలు వాతలు తేలివున్నాయి. ముక్కు దగ్గర రక్తం చారిక. శీను పెడుతోన్న వెక్కిళ్లకి వాడి గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. వీళ్లను చూడగానే శీను బావురుమన్నాడు. కాసేపటికి తేరుకొని నెమ్మదిగా చెప్పాడు.

"టీ గ్లాసులు తీస్తుంటే చేయి జారింది. సేటు కొట్టాడు!"

శీను మళ్లీ ఏడుపు అందుకున్నాడు. లక్ష్మి శీనుని ఓదార్చుతోంది.

కిట్టుకు పనంటే సరదా పోయింది. భయం పట్టుకుంది.

''నేను పన్లోకి వెల్లను - నేను పన్లోకి వెల్లను'' గొణుక్కుంటూ - ఇంటి దారి పట్టాడు.

పరధ్యానంగా నడుసోన్న కిట్టును ఎవరో భుజం పట్టి ఆపారు. కిట్టు గిరున తిరిగి చూసాడు. పిండి మరవాడు!

కిట్టు కళ్లముందు ఏవేవో దృశ్యాలు కదిలాయి. పిండిమరవాడు లారీలోకి ఎగబాకుతున్న దృశ్యం దగ్గర ఆగిపోయాయి.

'' ఇదుగో... ఇది మీ అక్కకి ఇవ్వు'' అంటూ నవ్వి - ఏదో పొట్లం కిట్టు చేతిలో పెట్టాడతను. దాంతోపాటే కిట్టుకు రెండు చాక్లెట్లు.

ఆతను కిట్టు బుగ్గ నిమిరి - సైకిల్ మీద రయ్యిన వెల్లిపోయాడు.

కిట్టుకు భూభారం చేతిన మోస్తున్నట్లుగా వుంది. చేతిలో చాక్లెట్లను పిండిమరవాడు వెల్లినవైపు కసికొద్దీ విసిరాడు. స్వర్ణ కోసం ఇచ్చిన పొట్లాన్ని నేల మీద కొట్టబోయి తమాయించుకొన్నాడు. కిట్టు బుర్రకి ఏదో తట్టింది. భద్రంగా ఆ పొట్లం ఇంటికి తీసుకొళ్లాడు. కిట్టు వాళ్లమ్మ, మామయ్య ఇంకా ఏదో మాట్లాడుకుంటున్నారు.

కిట్టు తిన్నగా వెల్లి - ఆ పొట్లాన్ని మామయ్య చేతికిచ్చాడు.

మామయ్య అయోమయంగా ఆ పొట్లాన్ని అటు ఇటూ తిప్పి చూసాడు.

ఓ చిన్న కాగితం దొరికింది.

''మైపాడుకెళదాం. బస్టాండ్‌కిరా''

ఆ రెండు ముక్కలు మామయ్య గట్టిగానే చదివాడు. .

'' ఎవరిచ్చార్రా ఇది?'' మామయ్య కిట్టును గద్దించాడు.

''పిండిమరవాడు....స్వర్ణక్కకి.....''కిట్టూ మాట పూర్తవ్వక ముందే వాళ్లమ్మ స్వర్ణని బరబరలాక్కొచ్చింది.

మామయ్య కాగితాన్ని స్వర్ణ మీదికి విసిరాడు. స్వర్ణకు ఏమీ అర్థం కాలేదు. కాగితం తీసుకొని చదివింది.

ఇంతలో కిట్టూ వాళ్లమ్మ ఆ పొట్లం విప్పింది.

చికెన్ బిర్యానీ!

విప్పిన పొట్లాన్ని విప్పినట్లుగానే స్వర్ణ మొహాన విసిరికొట్టింది వాళ్లమ్మ.

స్వర్ణ జుట్టు కుదుళ్ళు పుచ్చుకొని, ఆ చెంపా ఈ చెంపా వాయించింది, వాళ్లమ్మ.

''ఒసే దరిద్దరపు మొహమా! బిరియానీ పొట్లానికి ఒళ్ళు అమ్ముకుంటున్నావంటే? ముదనష్టపుదానా!''

కిట్టు వాళ్లమ్మ ఒళ్లు మరిచిపోయింది. స్వర్ణని ఇష్టం వచ్చినట్లు బాదుతోంది.

కిట్టు బిగుసుకుపోయాడు.

''వంటి మీదికి పట్టుమని పద్నాలుగేళ్ళు వచ్చినయ్యో, లేదో - ఒళ్లు అంత తీవరం ఎక్కిపోయిందంటే? తీవరం! పాపిట్టి దానా!'' కిట్టువాళ్లమ్మ నోటికొచ్చినట్లు మాట్లాడుతూ అందిన చోటల్లా - ఎడాపెడా కొడుతోంది.

''ఓ యమ్మో.... ఓరి నాయనో...'' స్వర్ణ అరుస్తోంది.

కిట్టూ వాళ్లమ్మ అదేవేగంతో కిట్టును కూడా వాయించింది.

'' ఎదవ సచ్చినోడా! ఏలెడంత లేవు... పుడింగిగాడి లాగా భాగోతమంతా నడిపిత్తావా? నీ దెవసం చెయ్య....!'' కిట్టును వంగదీసి బాదింది.

కిట్టు కిక్కురు మనలేదు.

స్వర్ణ తేరుకొని - కళ్ళు తుడుచుకుంది

''నువ్విట్లా చేయబట్టే - వెళ్లిపోదామనుకొన్నా!'' స్వర్ణ గట్టిగా అరిచింది.

'' ఎల్లవే! ఎల్లు! నీ అక్క ఎల్లి కుక్కలు చింపిన ఇస్తరయింది! పురుగులు పడి చత్తంది! ఎల్లు...! నువ్వు కూడా ఎల్లి పురుగురలు పడిచావు! మురుగులో పడి దొర్లు! అందరూ ఎల్లండి. ఈ సచ్చినాణ్ణి కూడా తీసుకెల్లవే!'' కిట్టును స్వర్ణ వైపు ఒక తోపు తోసింది వాళ్లమ్మ.

కిట్టు ఆ విసురుకు వెళ్లి కిందపడాడు. మోకాళ్లు చెక్కుకు పోయాయి.

''మీ నాయన చేసిన పనే ఈడూ చేత్తాడు. తీసుకెళ్లు! బోకరు కొడుకు బోకరు కాక ఏమవుతాడు?''

''ఊరుకోయే అక్కా...'' మామయ్య ఓదార్చాడు. '' ఏదో చిన్నపిల్ల....తెలీక చేసిందిలే. నే చెప్తాగా! నువ్వెళ్లి అన్నమొండు...పో'' అక్కని పక్కకి నెట్టాడు.

కిట్టూవాళ్లమ్మ ఆవేశంతో తిడుతూ - శాపనార్థాలు పెడుతూ వెళ్లింది.

కిట్టు మామయ్యని వాటేసుకున్నాడు. వెక్కివెక్కి ఏడ్చాడు. వాడికి ఏం

మాట్లాడాలో తెలియదు. వాడి అమ్మ కొట్టినందుకు వాడికి బాధలేదు. రేపంటే భయమేస్తోంది. లక్ష్మి మాటలు చెవుల్లో మోగుతున్నాయి. శీను మాటిమాటికి కళ్ల ముందుకు వస్తున్నాడు. కిట్టుకు జ్వరమొచ్చినంత పనయ్యింది. మామయ్యని కరుచుకొని నిద్రపోయాడు.

''లేరా కిట్టూ....బడికి ఏళవట్లా....?'' కిట్టూ వాళ్ళమ్మ వాడిని తట్టి లేపింది.

కిట్టుకి కలో నిజమో అర్థం కాలేదు. చుట్టూ చూసాడు.

మామయ్య లేడు. స్వర్ణ రిక్షావాళ్లకి ఇడ్లీలు పెడుతోంది. కిట్టు అపనమ్మకంగా చూసాడు.

''కొళాయి కట్టేస్తారు....పళ్లు తోముకురా....పో!'' వాడి అమ్మ వాణ్ణి తరిమింది.

కిట్టు గబగబ తయారయి, సంచి తగిలించుకొన్నాడు.

బడికి బయలుదేరడానికి బయట అడుగు పెట్టాడో లేదో - వెనక నుంచి స్వర్ణ కేకేసింది.

''ఒరేయ్ కిట్టూ.... ఆగరా! నేనూ వస్తున్నా!''